పూడూరు మండలం మన్నెగూడలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

దేశానికి తీరనిలోటు

మన్మోహన్ సింగ్‌కి నివాళులర్పించిన నేతలు..

వికారాబాద్, డిసెంబర్ 27: భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పలువురు నాయకులు మన్మోహన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

దోమ: దేశానికి దిశా నిర్దేశం చేసిన వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ ప్రధాన కూడలిలో పార్టీ నాయకులతో కలిసి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలం మన్నెగూడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడే కాకుండా అపర మేధావి అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హమీపథకం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, శ్రీనివాస్, అబ్రహం, సురేశ్, సత్తర్ ఉన్నారు.

వికారాబాద్: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

తుల్జా భవానీ మాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేలు..

ధారూరు, డిసెంబర్ 27: మండల పరిధిలోని నాగారం గ్రామంలో జరుగుతున్న తుల్జా భవానీ మాత జాతరలో భాగంగా అమ్మవారిని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నాయకులతో కలిసి దర్శించుకున్నారు. శుక్రవారం తుల్జా భవానీ మాత జాతర ముగింపు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధారూరు మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,రాములు, రాజూగుప్తా, పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ ముకుంద ఆశోక్ కుమార్, పరిగి మండల నాయకులు, నాగారం గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'మత్తు'కు దూరంగా ఉండాలి

శిక్షణకు హాజరైన వాలంటీర్లు

వికారాబాద్, డిసెంబర్ 27 : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఎల్‌సీఏ కో-ఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ భవన సముదాయంలోని జిల్లా మహిళా సమాఖ్య మీటింగ్ హాల్‌లో రాష్ట్రస్థాయి కోఆర్డినేటింగ్ ఏజెన్సీ న్యూ హోప్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల, మద్యపానం దుర్వినియోగం, నివారణ అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌సీఏ కోఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం యువతలో ఎక్కువైందన్నారు. ఈ మహమ్మారిని తగ్గించడానికి మాస్టర్ వాలంటరీలు (నశాముక్త భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా) స్వచ్ఛందంగా పనిచేయాలన్నారు. మత్తుకు బానిసలుగా మారిన వ్యక్తులను డీఅడిక్షన్ కేంద్రాల్లో చేర్పించాలని తెలియజేశారు. కార్యక్రమానికి కొడంగల్ సీడీపీవో రజిత , ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశమ్మ, శాంత, జిల్లా సంక్షేమ అధికారిని ఆఫీస్ నుంచి ఎం వెంకటేశ్ ఎఫ్ ఆర్ వో నశాముక్త భారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ పులిందర్, మధు, వికారాబాద్ జిల్లాలోని ప్రతి మండలం నుంచి ముగ్గురు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్.. చేసేది గంజాయి సరఫరా



సాఫ్ట్‌వేర్ డెవలపర్ రమేశ్‌బాబును అరెస్టు చేసిన పోలీసులు

ఆబ్కారీ పోలీసులకు పట్టుబడిన సాఫ్ట్‌వేర్ డెవలపర్

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): చెడు వ్యసనాలకు అలవాటుపడిన ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ గంజాయి విక్రయిస్తూ అబ్కారీ పోలీసులకు పట్టుపడ్డాడు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నగరానికి చెందిన భరత్ రమేశ్‌బాబు వృత్తిరీత్యా ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రతినెలా రూ.70వేల వేతనం అర్జిస్తున్నాడు. అయితే చెడు వ్యసనాలకు అలవాటుపడిన రమేశ్‌బాబుకు వచ్చే వేతనం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి సరఫరా చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఖమ్మం ప్రాంతానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి సూచన మేరకు నగరంలోని వినియోగదారులకు గంజాయి సరఫరా చేస్తున్నాడు. దీనిలో భాగంగానే శుక్రవారం కూకట్‌పల్లి, వసంతనగర్ బస్టాప్ వద్దకు రమేశ్‌బాబును పిలిపించిన సంతోష్ అతడికి గంజాయి అప్పగించి వినియోగదారులకు చేరవేయాల్సిందిగా సూచించి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గంజాయి సరఫరా చేసేందుకు యత్నించిన రమేశ్‌బాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.1కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా, గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగరాజు, ఎస్ఐ జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుళ్లు శశికిరణ్, కార్తిక్‌లను అబ్కారీ ఈడీ కమలాసన్ రెడ్డి, ఎస్‌టీఎఫ్ డీఎస్పీ తిరుపతి యాదవ్ అభినందించారు.

31 నుంచి ఫౌండర్స్ ఫెస్ట్

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వికాస్ తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 27: గ్రామీణ యువతకు స్టార్టప్స్‌పై ప్రోత్సహించేందుకు ఈనెల 31వ తేదీ నుంచి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ఫౌండర్ ఫెస్ట్-2.0 నిర్వహిస్తున్నామని ఎడ్వెంచర్ పార్క్ ప్రతినిధి వికాస్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను సానియా, ఇలియాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి స్టార్టప్స్‌తోపాటు చిన్న వ్యాపారులను సుమారు 30వేల మందిని ఆహ్వానిస్తున్నామని, 200 కంపెనీలకు చెందిన వారు స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. పల్లెటూరు నుంచి వచ్చి స్టార్టప్‌లు పెట్టుకున్న వారు తాము సాధించిన విజయాలను వివరిస్తారన్నారు. తమ సంస్థలో 60శాతం మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారు ఎలా వృద్ధి సాధించారన్న విషయాన్ని వివరిస్తారని, తద్వారా అందరిలో స్ఫూర్తి నింపుతారన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరవుతున్నారని తెలిపారు.

స్వలింగ సంపర్కుడికి బ్లాక్‌మెయిల్..కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబర్ 27: డేటింగ్ యాప్‌లో పరిచయమైన ఓ యువకుడు తన ఇంటికి వచ్చిన తర్వాత బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయడంతో పాటు అంతు చూస్తానంటూ బెదిరించాడని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట సమీపంలోని జైహింద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గురుకిరీట్ సింగ్ ఆనంద్(23) అనే యువకుడు స్వలింగ సంపర్కుడిగా ఉన్నాడు. ఏడాది కాలంగా గచ్చిబౌలిలోని ఓ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ట్యాక్స్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. స్వలింగ సంపర్కుల డేటింగ్ కోసం ఉపయోగించే 'గ్రిండర్' యాప్ ద్వారా గురుకిరీట్‌కు ఇటీవల గుర్తుతెలియని యువకుడు పరిచయం అయ్యాడు. తన ఇంట్లో కలుసుకుందామంటూ గురుకిరీట్ ఆహ్వానించడంతో రెండ్రోజుల కిందట గుర్తుతెలియని యువకుడు అతడి ఫ్లాట్‌కు వచ్చాడు. కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకున్న తర్వాత అతడిని బెడ్‌రూమ్‌లో తీసుకెళ్లగా తీవ్రంగా ప్రతిఘటించడంతోపాటు బెదిరింపులకు గురిచేశాడు. 'మీ అంతు చూస్తానని గురు కిరీట్‌ను బెదిరించడంతో పాటు న్యూసెన్స్ చేసి పరువు తీస్తానంటూ బ్లాక్ మెయిల్ చేశాడు. రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. యూపీఐ ద్వారా చెల్లించాడు. ఈ మేరకు బాధితుడు గురు కిరీట్ గురువారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బీఎన్ఎస్ 308(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభల పోస్టర్లు విడుదల

పరిగి,డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు శనివారం నుంచి నల్లగొండలో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం పరిగి మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు దశరథం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన గోడ పత్రిక ఆవిష్కరణకు ముఖ్య అతిథిలుగా మండల విద్యాధికారి గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మూడు రోజుల పాటు నల్లగొండ పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యా యులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షురాలు జమున,కార్యదర్శి వెంకటయ్య,యూనియన్ సభ్యులు సత్యయ్య, గంగాధర్, శంకర్‌రావు, రమేశ్, మేగ్యా, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దేముల్, డిసెంబర్, 27: వికారాబాద్ జిల్లా కేంద్రంలో 22వ రోజు కొనసాగుతున్న ధర్నా కార్యక్రమానికి శుక్రవారం పెద్దేముల్ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగ్యా నాయక్ మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్క రించాలని డిమాండ్ చేశారు. పేస్కేలు, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, నర్సింహులు, రాఘవేందర్, వెంకటేశ్, రాజేశ్వరి, గోపిక, గురువప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా..

దోమ, డిసెంబర్ 27: మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఎన్కెపల్లి హన్మంతు యాదవ్ నాన్న చిన్నయ్య అనారోగ్యంతో మరణించగా అదే గ్రామానికి చెందిన వారు ఆయన కుటుంబాన్ని పరమార్శించి రూ. పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బొంపల్లి బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

వికారాబాద్, డిసెంబర్ 27 : బస్సు ఎక్కుతుండగా ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం శివరాంనగర్ కాలనీకి చెందిన భ్రమరాంబ అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం వికారాబాద్ నుంచి సదాశివపేట వెళ్లేందుకు పట్టణంలోని బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసును దొంగలించారు. మెడలో నుంచి ఎవరో బంగారు గొలుసు దొంగిలించారని కన్నీరు మున్నీరుగా విలపించింది. వెంటనే వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తన ప్రేమకు అడ్డొస్తున్నాడని..

బాలిక ప్రియుడిపై ప్రేమోన్మాది కత్తితో దాడి

- తీవ్రగాయాలు.. దవాఖానకు తరలించిన పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితుడు

వెంగళరావునగర్, డిసెంబర్ 27: బాలికను ప్రేమిస్తున్న ప్రియుడిపై ఓ ప్రేమోన్మాది కత్తితో దాడికి పాల్పడ్డాడు. తన ప్రేమను నిరాకరించిన బాలిక మరో యువకుడిని ప్రేమిస్తుండటంతో అతడిపై కక్షగట్టిన ఆ ఉన్మాది దాడికి తెగబడ్డాడు. బాలిక ప్రేమించే ప్రియుడి గొంతుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట్ వెస్ట్ శ్రీనివాసకాలనీలో గురువారం రాత్రి ఈ దారుణం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ శ్రీనివాసకాలనీలోని కమ్యూనిటీహాల్ సమీపంలోని ఓ లేడీస్ హాస్టల్‌లో బాలిక(16) తన అక్కతో కలిసి వంటపని చేస్తున్నది. ఈ హాస్టల్‌కు సమీపంలోని బాయ్స్ హాస్టల్‌లో బాలిక బంధువులు పని చేస్తుండటంతో.. వారిని పలుకరించేందుకు బాలిక తరచూ వచ్చిపోతుండేది. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి సాయిప్రవీణ్(19) ఆ బాలికకు పరిచయమయ్యాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. అయితే బాలిక పని చేసే హాస్టల్‌లోనే ఒడిశాకు చెందిన నసీరుద్దీన్‌ఖాన్(27) వంట పని చేస్తుండేవాడు. తనను ప్రేమించాలని నసీరుద్దీన్‌ఖాన్ బాలికను వేధించేవాడు.

నసీరుద్దీన్‌ఖాన్ ప్రేమను ఆ బాలిక నిరాకరించింది. తన ప్రేమను కాదని.. సాయిప్రవీణ్‌ను బాలిక ప్రేమిస్తుండటంతో అతను కోపంతో రగిలిపోయేవాడు. సాయిప్రవీణ్‌ను ఫోన్‌లో తరచూ బెదిరింపులకు గురిచేసేవాడు. నసీరుద్దీన్‌ఖాన్ గురువారం రాత్రి 11 గంటల సమయంలో మాట్లాడేందుకు రమ్మంటూ సాయిప్రవీణ్‌ను వెంగళరావునగర్‌కు హాస్టల్ వద్దకు పిలిపించాడు. పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో సాయిప్రవీణ్ గొంతుపై దాడికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన సాయిప్రవీణ్‌ను దవాఖానకు తరలించారు.

చెరువుల హద్దులపై హెచ్ఎండీఏ కసరత్తు

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న చెరువుల నోటిఫికేషన్ ప్రక్రియ జనవరి మొదటి వారంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరగనున్నది. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో డిసెంబర్ 30వ తేదీలోగా తుది జాబితా పురోగతి నివేదిక ఇవ్వాలని ఆదేశించగా... ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ క్రమంలో చెరువుల హద్దు రాళ్ల నిర్ధారణ, ఫైనల్ నోటిఫికేషన్ జారీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిగే సమన్వయ లోపాలపై ఈ సమీక్ష సమావేశంలో చర్చించనున్నట్లుగా తెలిసింది. అయితే హెచ్ఎండీఏ పరిధిలోని 3వేలకు పైగా చెరువుల హద్దురాళ్ల నిర్ధారణకు మరో ఆరు నెలల సమయం కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే హద్దురాళ్ల నిర్ధారణ అంశంపై హైకోర్టు ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినా నోటిఫికేషన్ జారీలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఈ దఫా జరిగే విచారణలో గడువు విషయంలో ఉన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందనేది చూడాలి.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి 20ఏండ్ల జైలు

నిందితుడు భార్గవ్‌కుమార్

సైదాబాద్, డిసెంబర్ 27: మాయమాటలతో ఓ బాలికపై లైంగిక దాడి చేసి పెండ్లి చేయాలని బెదిరింపులకు పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చించిందని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2019లో సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సైదాబాద్ హరిజనబస్తీలో నివాసముండే అమిందాల భార్గవ్‌కుమార్(36) అలియాస్ చింటూ, భార్గవ్ ఓలా బైక్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, అతడికి భార్య, కుమారుడు ఉన్నాడు. బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో తండ్రి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో భార్గవ్‌కుమార్‌పై సైదాబాద్ పోలీసులు పోక్సో కేసు నమోదు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ విచారణను వేగవంతంగా కొనసాగించారు. పోక్సో కేసును విచారించిన నాంపల్లి 12వ, అడిషనల్ సెషన్స్ జడ్జి టి. అనిత శుక్రవారం విచారణలో నిందితుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. JS అకాడమీ (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306-All

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భార్య, కూతురు హత్య కేసులో జీవిత ఖైదు

భర్త, మామతో సహా నలుగురికి శిక్ష విధించిన కోర్టు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): కట్టుకున్న మొగుడే కాలయముడయ్యాడు.. భార్య, ఏడాదిన్నర కూతురును అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులు ప్రధాన ముద్దాయి చేవెళ్ల కుమార్(25), చేవెళ్ల సాయన్న(60), మేకల రాజు(22)లకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఒక్కొక్కరికి రూ.40వేల చొప్పున జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.జయలక్ష్మి తీర్పునిచ్చారు. అదనపు పీపీ కె.జ్యోతిరెడ్డి కథనం ప్రకారం.. పూడూరు మండలం కందాలపల్లి గ్రామానికి చెందిన చేవెళ్ల కుమార్‌కు వారి సమీప బంధువైన శ్రీనివాస్‌తో అలివేలుకు వివాహం జరిగింది. కొంత కాలానికి కుమార్, అలివేలు మధ్య అక్రమ సంబంధం ఏర్పడటంతో శ్రీనివాస్‌కు విడాకులిచ్చి కుమార్‌ను పెండ్లి చేసుకుని మెయినాబాద్ మండలం ముర్తుజాగూడలోని ఒక ఫాంహౌజ్‌లో పని చేస్తూ ఏడాదిన్నర వయస్సుగల పాపతో ఉంటున్నారు. ఈ క్రమంలో తన భార్య ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని ఆమెను అనుమానించిన కుమార్ తన తండ్రి, స్నేహితులతో కలిసి భార్య అలివేలును చంపాలని నిర్ణయించుకుని 2012 మే 7న వారి స్వగ్రామానికి దగ్గరలోని గుడికి వెళ్లాలని భార్య, కూతురు తీసుకుని వారితో పాటు కుమార్ తన తండ్రి, స్నేహితులతో కలిసి వెల్తూ మార్గం మధ్యలో రాకంచర్ల గ్రామ సమీపంలో భార్య అలివేలు గొంతు కోసి హత్య చేసి పెట్రోలు పోసి తగలబెట్టగా, ప్రాణంతో ఉన్న పాపను మంటల్లో వేసి అత్యంత కిరాతకంగా హత్య చేసి పారిపోయారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకున్న చేవెళ్ల పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా.. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

వ్యక్తి హత్య కేసులో జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో ఒకరు తన అవసరానికి అప్పు అడిగితే ఇవ్వలేదన్న కక్షలను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితులు గూడూరు కొమురయ్య(35), కొత్త కురువ రాంచంద్రయ్య(60)లకు జీవిత ఖైదు, రూ. 5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.జయలక్ష్మి తీర్పునిచ్చారు. అదనపు పీపీ కె.జ్యోతిరెడ్డి కథనం ప్రకారం.. చేవెళ్ల మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పంబలి శ్రీరాములు(60) గొర్రెలను పెంచుతూ వ్యాపారం చేసేవాడు, అదే గ్రామానికి చెందిన కొమురయ్య తన గొర్రెలను శ్రీరాములుకు అమ్మగా డబ్బులు చెల్లించలేదని, అతడి భార్యతో అక్రమ సంబంధం ఉందని శ్రీరాములుపై కక్ష పెంచుకుని హత్య చేయాలని పథకం పన్నాడు. తన అవసరానికి అప్పు అడిగితే ఇవ్వలేదన్న కక్ష రాంచంద్రయకు ఉండేది. అయితే ఊరు చివర గొర్రెలను ఉంచి అక్కడే నిద్రిస్తున్న శ్రీరాములుతో కలిసి ఇరువురు మద్యం సేవించి అతను నిద్రలోకి జారుకోగానే ఇద్దరు కలిసి గొడ్డలితో కొట్టి హత్య చేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న చేవెళ్ల పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా.. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హయత్‌నగర్, డిసెంబర్ 27: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్ సాహెబ్ నగర్ కాలనీలో నివాసముండే నవీళ్ల సాయికుమార్(25) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా అతను సాహెబ్ నగర్ కాలనీలో నివాసముంటు చదువుకుంటూనే అప్పుడప్పుడు పెయింటింగ్ పనికి వెళ్తుంటాడు. ఈ నెల 19న సాయికుమార్ స్నేహితుడు మంజునాథ్ తో కలిసి ఇద్దరు తన బైక్ పై సామానగర్ నుంచి భాగ్యలత వైపు వెళ్తున్నారు. శాంతినగర్ వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు సాయికుమార్, మంజునాథ్ వెళ్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు రోడ్డుపై పడిపోగా సాయికుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962